అంతర్దాహం

దోనేపూడి రాజారావు

విఠల్ గేటువగ్గర నిలబడి బంగళావంక ఎగాదిగా చూస్తున్నాడు. ఆబంగళాలో మనుషులెవరూ కనపడలేదు. ఆ బంగళా నలువైపులా ఘెరావ్ చేసినట్లుగా పెద్ద గార్డెన్ చూడముచ్చటగా వుంది. పిల్లప్రేవుల్లా వంకరటింకరగా ఆ గార్డెన్ నుంచి బంగళాకి అనేక దార్లున్నాయి. ఆ బంగళావంక చూస్తూనే పదినిముషాలు గడిచిపోయింది విఠల్కి.

ఇంతలో గేట్కీపర్ కాకీదుస్తుల్లో, చేత కర్ర ఒకటి పట్టుకొని, అతను నేపాలీవాడనుకుంటాను తెల్లగా పాలిపోయినవాడిలా వున్నాడు, వచ్చి లోపల గేటుదగ్గర నిలబడ్డాడు. అతడు విఠల్ని ఎగాదిగా చూశాడు "ఎప్పుడూ రాలేదే! ఎవరా ఇతను?" అని.

"నేను బాబాయిగార్ని కలుసుకోవాలి." గేటు తియ్యమన్నట్టుగా అడిగాడు విఠల్.

"బాబాయిగారా ?" అర్థం కాని దృష్టితో మళ్ళీ అడుగుతున్నట్టుగా విఠల్‌వంక చూశాడు గేట్‌కీపర్.

"ఇంతకూ బాబాయిగారు లోపల లేరా ?" మళ్ళీ ఆత్రుతగా అడిగాడు విఠల్.

"బాబాయిగారా ? బాబాయిగారంటూ ఇక్కడ ఎవరూలేరు !" విసుక్కున్నట్లుగా విఠల్ వంక చూచి వెనక్కు తిరిగాడు గేట్‌కీపర్.

"అదే ! శివరాంప్రసాద్ జమిందార్ గారు !" అంటూ గట్టిగా అన్నాడు. విఠల్.

ఆ మాట వినగానే గేట్‌కీపర్ సంతోషంతో ముఖం ఇంత చేసుకొని తిరిగొచ్చి గేటు తాళం తీశాడు విఠల్ చేతిలోవున్న సూట్‌కేసు, టిఫిన్ క్యారియర్ తాను తీసుకున్నాడు.

ఇంతలో గేటుతీస్తున్న చప్పుడువిని బంగళానుంచి ఓ నౌకరు హడావిడిగా పరిగెత్తుకొచ్చాడు. గేట్‌కీపర్ ఆ సామానులు అతని చేతికి ఇచ్చాడు అతడు విఠల్‌ను శివరామ్‌ప్రసాద్ వద్దకు తీసికెళ్ళాడు.

శివరామ్‌ప్రసాద్ ఆ గార్డెన్లో ఓ మూల గార్డెన్‌ఛైర్‌లో పడుకొని ఏదో ఇంగ్లీషుపుస్తకం చేత పట్టుకొని ఆకాశం కేసి చూస్తూ పరధ్యానంలో వున్నాడు. ఉండుండి సిగరెట్ దమ్ము వేసుకొంటున్నాడు.

"సార్ ! సార్ ! సార్ !" అంటూ నౌకర్ శివరామ్‌ప్రసాద్‌ని ఈ లోకంలోకి తీసుకొచ్చాడు.

అటు తిరిగి వున్న శివరాంప్రసాద్ నెమ్మదిగా ఇటు తిరిగి విఠల్‌వంక తదేకంగా చూశాడు. అతణ్ణి తానెప్పుడూ చూడలేదు. కాకీపాంటు వేసుకొని వైట్ లాం క్లాత్ చొక్కా తొడుక్కొని వున్నాడు. కాళ్ళకు మామూలు చెప్పులు వున్నాయి. చొక్కా నలిగుంది. వచ్చీరాని మీసం, గడ్డం, ఓ పద్ధెనిమిదేళ్ళు వుంటాయి. పేదవాడుగా కన్పిస్తున్నా ముక్కూ, ముఖంలో జమిందారు పోలికలు కనిపించాయి శివరామ్‌ప్రసాద్‌కి అలాగే కొన్ని క్షణాలు తీవ్రంగా చూశాడు విఠల్‌ని.

విఠల్ ఆ చూపు భరించలేకపోయాడు. భయపడ్డాడు. అయినా తానూ తదేకంగా చూశాడు శివరామ్ ప్రసాద్‌ను. శివరాంప్రసాద్ మిరపకాయల్లాంటి మీసాలు, పెసరకాయల్లాంటి పెదవులు కందికాయల్లాంటి కనుబొమలు, ఆ బోడితలకు చుట్టూ కట్ట కట్టిన నలుపూ తెలుపూ కలిసున్న అతని వెంట్రుకలు-ఇవన్నీ కలుపుకొని మొత్తంగా చూస్తే యస్వీరంగారావులా కన్పించాడు విఠల్‌కి. అంత బొద్దుగా, దబ్బపండులావున్న శివరామ్‌ప్రసాద్‌ని చూడగానే గౌరవభావం ఏర్పడింది విఠల్‌కి. ఆ చూపుల పోటీలో విఠల్

నిలవలేకపోయాడు. తలదించేసుకొని పక్కకు చూశాడు

విఠల్ అలా ప్రక్కకు చూడ్డం చూసి శివరాంప్రసాద్ పిచ్చివాడిలా పకపకా నవ్వాడు. ఆ నవ్వు చూసి మళ్ళీ భయపడ్డాడు విఠల్. చేతిలోవున్న సిగరెట్‌ని యాష్‌ట్రే మీద పెట్టాడు రెండో చేతిలోవున్న పుస్తకాన్ని మూసి వేశాడు శివరాంప్రసాద్.

"సిడౌన్! సిడౌన్!" అంటూ పక్కనున్న కుర్చీ చూపించాడు విఠల్‌కి. తానూ లేచి సరిగా కూర్చు న్నాడు.

విఠల్ శివరాంప్రసాద్ ఆజ్ఞను శిరసా వహించాడు. అది చూసి నౌకర్ సూట్ కేస్, టిఫిన్ క్యారియర్ విఠల్‌కు ప్రక్కగా పెట్టి వెళ్ళిపోయాడు.

"ఎవరవు బాబూ నువ్వు? నిన్నెక్కడా చూసినట్లు లేదే? ఇందాక అందుకే అంతసేపు చూసాను అడక్కుండానే తెలుసుకుందామని! కానీ అంతుపట్టలేదు!" అంటూ మరొకసారి నవ్వాడు.

"నేను విఠల్ని! విశ్వేశ్వర్రావుగారి అబ్బాయిని! సీతాదేవిగారి మనవడ్ని! కాకినాడనుంచి వచ్చాను!"

"నువ్వు విశ్వేశ్వరరావు కొడుకువా? సీతాదేవి మనవడివా? నిజమేనా?" అంటూ హడావుడిగా కుర్చీలోంచి లేచొచ్చి వణికిపోతూ విఠల్ భుజాల మీద గట్టిగా చేతులు వాల్చాడు! కళ్ళ ల్లోకి మళ్ళీ మళ్ళీ తదేకంగా చూశాడు. విఠల్ ఏదో అబద్ధం చెప్తున్నట్లుగా అనుమానించాడు.

"బాబాయిగారూ! నేను అబద్ధం ఆడటంలేదు!" అంటూ విఠల్ గబాల్న లేచాడు

"సిడౌన్ మేన్! సిడౌన్! నువ్వు నన్ను బాబాయని పిలుస్తున్నావా? ఇప్పటికి ఇరవై నాలుగేళ్ళనాటి పిలుపది! మళ్ళీ ఈనాడు నీ నోట విన్నాను!" ఆనందంతో అతని ఒళ్ళు ఒకటికి నాలుగుసార్లు పులకరించింది. విఠల్ని దగ్గరకు తీసుకొని గట్టిగా కౌగలించు కున్నాడు. బొటాబొటా కన్నీళ్లు కారుస్తూ వెళ్ళి తన గార్డెన్ ఛైర్లో జారిగిలబడ్డాడు.

"మీ నాన్నా నన్ను బాబాయనే పిల్చేవాడు!" అంటూ పరధ్యానంలోకి వెళ్ళిపోయాడు.

విఠల్‌కి ఆయన్నిచూసి జాలివేసింది. తానూ ఆయనకి దగ్గరగా తన కుర్చీలో కూర్చున్నాడు.

కొద్దిక్షణాలకి తిరిగి స్వీయధ్యానం లోకి వచ్చేశాడు శివరాంప్రసాద్.

"పోతురాజూ! పోతురాజా!" అంటూ నౌకర్ని గట్టిగా పిలిచాడు శివరాం ప్రసాద్ వాడు రెప్పపాటులో వచ్చి నిలబడ్డాడు.

"ఈ సామాను తీసికెళ్ళి నా గదిలో పెట్టు! ఇదిగో నా మంచం ప్రక్కన ఈయనకూడా మంచం వేయి.



అక్కడే పడుకుంటాడు! ముందు వేణ్ణీళ్ళు పెట్టు! స్నానం చేస్తాడు!"

ఆ మాటలు విని వినడంతోనే పోతురాజు సామాను తీసుకువెళ్ళాడు. శివరాంప్రసాద్ తన కుర్చీని విఠల్ కుర్చీకి దగ్గరగా లాక్కొని విఠల్ చెయ్యి తన చేతుల్లోకి ఆప్యాయంగా తీసికొన్నాడు. శివరాంప్రసాద్ చేతుల స్పర్శ తగిలి విఠల్ ఆత్మీయంగా ఫీలయ్యాడు.

"నువ్విలా సన్నగా వున్నావేమిటి? ఈ వయసులో మీ నాన్న దుత్తలా గట్టిగా వుండేవాడు. ఇప్పుడు నీ కెన్నేళ్లు బాబూ?''

"పందొమ్మిదో సంవత్సరం జరుగుతోంది!"

"అయితే నువ్వింకా కుర్రవాడివే! అలా సిగ్గుపడతావెందుకు? భయమెందుకు? మీ నాన్న ఎంతధైర్యస్థుడని! మీరు బ్రదర్సెందరు బాబూ?" అంటూ ఒకదాని తర్వాతొకటి అంతులేకుండా అడిగాడు శివరాంప్రసాద్.

"మా నాన్నకు నే నొక్కడ్నే!"

"అలాగా! మీ నాన్నా ఒక్కడే! ఆయనేం చేస్తున్నాడిప్పుడు?'' ఎంతో దాహంతో అడిగాడు శివరాంప్రసాద్.

"ఆయన లేదు సార్! నా అయిదో ఏటే చనిపోయాడు! మా మదర్ కూడా లాస్టియర్ చనిపోయింది ఇక నాకు మిగిలింది మా నాయనమ్మ సీతాదేవి వొక్కతే!''

"అబ్బ! ఏం చావు కబుర్లు

చెబుతున్నావయ్యా!'' అంటూ బాధ పడ్డాడు గుండె బరువెక్కింది. అమితంగా ఆయాసపడ్డాడు. కుర్చీకి అంటుకుపోయాడు. అది చూసి విఠల్ భయపడ్డాడు ఆయన భుజంపట్టుకొని కదిలించి చూశాడు. ''బాబాయ్! బాబాయ్! ఏమిటలా అయిపోయారు?"

"ఏం లేదు బాబూ!'' అంటూ నూతిలోంచి పలికినట్లు సన్నగా పలికాడు. చేతితో సైగ చేసాడు తనకేం ఫర్వాలేద న్నట్టుగా.

అలా కొద్దిక్షణాలు నిశ్శబ్దం. విఠల్ ఆయన బాధ చూచి వణికిపోయాడు శివరాం ప్రసాద్ కాసేపటికి తేరు కొన్నాడు 'మీ నాయనమ్మ సీతాదేవి నన్నుగురించి ఏమయినా చెప్పిందా?'' అని భయం భయంగా అడిగాడు

''ఆమేం చెప్పలేదు బాబాయిగారూ! మిమ్మల్ని కలుసుకోమని మాత్రం చెప్పింది మిమ్మల్ని చూసిరమ్మని మరీ మరీ చెప్పింది. మీ కోసం పులిహోర, పకోడీలు స్వయంగా చేసి పంపించింది. మీకు ఇంగువ పులిహోరన్నా, ఉల్లి పాయ పకోడీలన్నా ఇష్టమటగా!"అంటూ చిరునవ్వు నవ్వుతూ బాబాయ్ కేసి చూశాడు విఠల్.

"అలాగా! అలాగా!" అంటూ కొండంత సత్తువ తెచ్చుకొని లేవబోయాడు సంతోషబలంతో.

విఠల్ ఆయన్ను పట్టుకొని కూర్చోబెట్టాడు. దూరాన్నుంచి ఇదంతా చూస్తున్న పోతురాజును పిలిచి, ఇందాక తాను తెచ్చిన టిఫిన్ క్యారియర్ తెమ్మ న్నాడు విఠల్. నిముషాల్లో పోతురాజు ఆ టిఫిన్ క్యారియర్ తెచ్చి ఇచ్చాడు. దాహంగొన్న పిల్లవాడిలా ఎగబడి టిఫిన్ క్యారియర్ లాక్కున్నాడు శివరాం ప్రసాద్ "ఏదేదీ నన్ను చూడనీ!" అంటూ.

పోతురాజు ప్లేటు తెచ్చాడు వాడొచ్చేటప్పటికే టిఫిన్ క్యారియర్ ఖాళీచేశాడు శివరాంప్రసాద్

"ఎన్నాళ్ళకు తిన్నాను! ఎన్నాళ్ళకు తిన్నాను! సీతాదేవి వండిన పులిహోర, పకోడీలు తిని పాతికేళ్ళయింది! ఈ పాతికేళ్ళనుంచి ఆకలితోనే ఉన్నాను విఠల్ ఈ పాతికేళ్ళ ఆకలి ఈ టిఫిన్‌తో తీరిపోయింది విఠల్!" అంటూ సంతోష పడ్డాడు చెయ్యి తుడుచుకుంటూ

ఆయన సంతోషమేమిటో విఠల్‌కు అర్థంకాలేదు పాతికేళ్ళ క్రితం మా ఫ్యామిలీ ఫ్రెండయి వుంటాడనీ, అంత ఆత్మీయంగా వుండి వుంటారనీ అనుకున్నాడు విఠల్.

"అయ్యో నా మతి మండ! గెస్టు తెచ్చినవి తిన్నానేకాని గెస్టుకి టీ అన్నా ఇవ్వలేదు!" అని బాధపడుతూ పోతు రాజును పిల్చాడు శివరాంప్రసాద్. గెస్టుకి టీ, బిస్కట్లు తెచ్చివ్వమని వాణ్ణి కసురుకున్నాడు ఆ హుషారులో శివరాం

ప్రసాద్ గార్డెన్ ఛైర్‌లోంచి లేచి సిగరెట్ ముట్టించుకొని, ఉల్లాసంగా సిగరెట్ కాలుస్తూ అటూ ఇటూ పచార్లు చేశాడు ఏవేవో ఆలోచించుకుంటూ.

ఇంతలో టీ, బిస్కట్లు తెచ్చాడు నౌకరు. విఠలూ అంత మక్కువగానే తీసుకొన్నాడు. క్షణాల్లో తాగేశాడు.

"ఇదిగో సిగరెట్. కాల్చుకో!" అంటూ టీ త్రాగటం ముగించిన విఠల్‌కి ఇవ్వబోయాడు శివరాంప్రసాద్

"నో సార్, ఐ వోంట్ స్మోక్!"

"ఐ. సీ. దెన్ వెల్ అండ్ గుడ్! నీ వయసులో మీ నాన్న తెగ కాల్చే వాడు! నే నెంత వద్దన్నా వింటేనా వాడు! సరే అయిందేదో అయిపోయింది!" ఈ మాటలు చెబుతూనే అక్కడికక్కడే పచార్లు చేశాడు శివరాం ప్రసాద్ మనసులోవున్న దూకుడంతా నడకలో చూపెట్టాడు.

"విఠల్! నీకో రహస్యం చెప్పేదీ? మీ నాన్నేకాదు, మీ నాయనమ్మకూడా బీడీ త్రాగేది! ఆమెకు గ్యాస్టిక్ ట్రబుల్ వుండేది! డాక్టర్ ఆమెకు బీడీ త్రాగమని సలహా ఇచ్చాడు! రోజుకు రెండూ మూడు బీడీలు తప్పక త్రాగేది!"

ఇంతలో నౌకరు వచ్చి ప్లేట్లు, టిఫిన్ క్యారియర్ తీసికెళ్ళాడు.

"రా? అలా షికారుకు పోదాం రా!" అంటూ శివరాంప్రసాద్ ముందుకు సాగాడు హ్యాండ్ స్టిక్ ఒకటి తీసుకొని. విఠల్ ఆయనతో జంటగా నడిచాడు. ఆ తోటలోనే ఓ సమాధి దగ్గరకు వెళ్ళి ఆగిపోయాడు శివరాంప్రసాద్ ఆ సమాధి చుట్టూ గులాబీతోట. ఆ సమాధిని చేతో స్పర్శిస్తూ "ఇది నా భార్య సమాధి! ఈమెకు గులాబీలంటే ఇష్టం! అందుకనే ఆమె సమాధి చుట్టూ ఈ తోట వేశాను. ఆమె చచ్చిపోయి యిరవై ఏళ్ళయింది! పాతికేళ్ళక్రితం, ఆమెను పెండ్లిచేసుకోక ముందు మీ ఫ్యామిలీతో వుండేవాణ్ణి! ఆమెతోనూ అయిదేళ్ళే వున్నాను! అంతలో ఈమె చనిపోయింది. తిరిగి మళ్ళీ నేను మీ ఫ్యామిలీలోకి రాలేకపోయాను. అలా ఒంటరి వాణ్ణయిపోయాను! నే నిక్కడి కొచ్చినప్పుడు, నువ్వు చెబితే నమ్మవేమో పదణాలంటే-పదణాలు జేబులో వుంది! ఇవ్వాళంటావా? పది లక్షల ఆసామినయ్యాను! ఇదంతా ఈమె ఆస్తే!" తన కథ చెబుతూ బాధగా నీలాకాశంకేసి చూశాడు శివరాంప్రసాద్.

ఆ బాధను శ్రద్ధగా విన్నాడు విఠల్.

"అమంటే మీరంత ఇదిగా వుండబట్టే ఈ నాడిలా బాధపడుతున్నారు!" సానుభూతి పలికాడు విఠల్.

"అంతే బాబూ! అంతే! అయినా ఆమెమీద నాకు వున్న మక్కువంతా ఆమెతో అయిదేళ్ళు ఉండేటప్పటికి విరిగి పోయిన పాలలా ముక్కలు ముక్కలయి

పోయింది. ఆమెకు తాను మహా ఆస్తిపరురాలినని గర్వ ముండేది! నన్నొక బానిసగా చూసేది! నాకొక రకంగా బుద్ధే చెప్పింది. ఆమె డబ్బును చూసి ఆమెను ప్రేమించాను! మీ కుటుంబంతో వున్నంతకాలం కరువుల్తో బాధపడ్డాను. కరువుల్తో విసుగెత్తిపోయిన నా మనసు సుఖ సౌఖ్యాలను కోరింది! నన్ను తెచ్చి ఇక్కడ పడేసింది! రెండు చేతులా ఖర్చుపెట్టాను. భోగ భాగ్యాలు కరువుతీరా అనుభవించాను! కానీ ఏం లాభం! మనశ్శాంతి లేకుండాపోయింది! ఆమె నన్ను నానాటికి వెట్టిచాకిరీ బానిసగా చూసింది అది భరించలేక తిరిగి మీ కుటుంబంలోకి వెళ్దామనుకున్నాను! అంత కంటే ఆత్మీయులు నా కెక్కడా కన్పించ లేదు! అయినా తిరిగి వెళ్ళడానికి సాహ సించలేకపోయాను! మీ నాయనమ్మకు నేనంటే పంచప్రాణాలు! అలాంటి ఆమెను వొదిలేసి వొచ్చేసి ఈ నరకం అనుభవిస్తున్నాను బాబూ! నేను వొచ్చేసే టప్పుడు మీ నాయనమ్మ కంటతడిపెట్టి అదేపనిగా ఏడ్చిందేగానీ నా మార్గాని కడ్డం రాలేదు! ఆనాడే ఆమె నా మార్గం అడ్డగించి వుంటే ఈనాడు నాకీ ఒంటరి తనం లేదు! ఈ నరకంలేదు!" అంటూ బొటా బొటా కన్నీరు కార్చాడు. కళ్ళ జోడు తీసి కంటనీరు మరీ మరీ తుడుచుకున్నాడు.

"ఈ వయసులో మీకో తోడు వుంటం మంచిదనుకుంటాను! మీ కెవరూ బంధువుల్లేరా బాబాయిగారూ?" ఆయన బాధకు జాలిపడి అడిగాడు విఠల్.

"ఏం చెప్పేది బాబూ? ఎక్కడి వాళ్ళక్కడ పోయారు! ఇలా ఒంటరిగా వుండటమే నా కలవాటయిపోయింది!" అంటూ ఆకాశంవేపుకు చూశాడు శివరాంప్రసాద్. సూర్యుడు అస్తమిం చాడు. మబ్బులు ఉదయించాయి. వాటికి గాలి తోడయింది.

"వర్షం వొచ్చేటట్టుగా వుంది! రూం కెళ్దాంరా!" అంటూ హ్యాండ్ స్టిక్‌తో నడుస్తూ బయల్దేరాడు శివరాం ప్రసాద్. చెయ్యి, ఒళ్ళూ వొణికాయి.

"చూట్టానికి దృఢంగానే వున్నారే! అలా వొణికిపోతున్నారేం బాబాయి గారూ? అడుగడుక్కీ ఆయాసపడ్తు న్నారు!" అడిగాడు విఠల్.

"మంచి తిండి తినడంతో ఈ ఒంటికేం బాగానేవుంది! కానీ మనసే రోగిష్టదయిపోయింది!" సమాధానం చెప్పాడు శివరాంప్రసాద్, విఠల్ ప్రశ్నకు.

"ఇంతకూ నీ సంగతులడగనేలేదు! ఎంతసేపూ నా సొద చెప్పుకుంటూ వచ్చాను! ఏం చదువుతున్నావు బాబూ?"

"ఇంటర్ పాసయ్యాను. ఇక చదవాలనుకోవడంలేదు!"

"అదేమిటి? అప్పుడే చదువు



మానివెయ్యటమా ? మానేసి ఏం చేస్తావ్?" నడుస్తున్న వాడల్లా నిలబడి అడిగాడు శివరాంప్రసాద్.

"ఇక ఏదయినా ఉద్యోగం చూసుకోవాలి! ఇంతవరకూ మా నాయనమ్మ మిషనుకుట్టి చదువు చెప్పించింది. ఇప్పుడామెకు చూపుకూడా తగ్గిపోయింది. కుట్టుపని మానేసింది ! ఆరోగ్యం సరిగా లేదు మంచం పట్టింది."

"ఏమిటీ ? సీతాదేవి మంచం పట్టిందా ? చూపు కనపడ్డం లేదా ?" అంటూ బాధపడ్డాడు శివరాంప్రసాద్. "పోనీ కళ్ళకు జోడు వేయించుకోక పోయిందా ?" మళ్ళీ అడిగాడు శివరాంప్రసాద్.

"నా కాలేజీ ఫీజులే కడ్తుందా ? ఆమె కళ్ళకు జోడే వేయించుకుంటుందా ? ఆమె కుట్టు సంపాదన నా కాలేజీ ఫీజులకే చాలలేదు ! పైగా నన్నింకా బీ. యస్సీ చదవమంటోంది. చదువు మానటానికి వీల్లేదంటోంది !"

"అవునవును ! నువ్వు చదువు మానటానికి వీల్లేదు ! ఆమె కాకపోతే నేను నీకు చదువు చెప్పిస్తాను ! ఎంత వరకు చదవాలనుకుంటే అంతవరకూ చదువుకో ?"

"అదికాదు బాబాయ్ ! మీరు చదివిస్తారు సరే ! నేను చదువుకుంటాను సరే ! మరి ఆమెను ఎవరు పోషిస్తారు ? ఆమెను పోషించాల్సిన బాధ్యత నాకు లేదూ ? అందుకే చదువు మానేసి, ఉద్యోగంచేసి ఆమెను పోషిస్తానంటున్నాను !"

"దటీజ్ కరెక్ట్ ?" అంటూ ఏదో ఆలోచించాడు శివరాంప్రసాద్.

"మీ నాయనమ్మ మాత్రం ఎవరని ? నేనవేది ఏమిటంటే - నేనూ మీ తాత లాంటివాడ్నే. నేనూ మీ తాత అనుకో ! అలాంటపుడు మీ నాయనమ్మ బాధ్యత నాకు లేకుండా పోతుందా? ఔనంటావా ? కాదంటావా ? టెల్ మీ బాయ్!" అంటూ భుజంమీద చెయ్యివేసి నిలబెట్టి అడిగాడు శివరాంప్రసాద్.

విఠల్ బదులు చెప్పలేదు. ఆయన చెయ్యి పట్టుకొని నెమ్మదిగా మెట్లెక్కించి ఆయన్ని రూంలోకి తీసుకొచ్చాడు. సోఫాలో కూర్చున్నారు. అంతసేపూ ఇద్దరూ మౌనం వహించారు. శివరాం ప్రసాద్ ఏవేవో తల్చుకొని లోలోన బాధపడ్డాడు.

"ఏదో కాంప్లెక్స్‌తో బాధపడుతున్నావ్ బాబాయ్ ! అదేమిటో చెప్పు బాబాయ్?" చేతులు పట్టుకున్నాడు విఠల్.

"నువ్వు తెలుసుకొని మాత్రం ఏం చేస్తావు బాబూ ! అంతా అయిపోయింది! తప్పంతా నాది ! చేతులారా చేసుకున్నాను ! చేసిందానికి సిగ్గుపడుతున్నాను !" అంటూ బాధపడ్డాడు. ఆ బాధతోనే లేచి అలమరానుంచి ఆ వణుకుతున్న చేతుల్తోనే స్కాచ్ బాటిల్ తెచ్చుకున్నాడు. తానొక గ్లాసులో పోసుకొని త్రాగుతూ మరో గ్లాసు విఠల్ కందించాడు.

"నో సార్ ! నో సార్ !" అంటూ ఆ గ్లాసును క్రింద పెట్టేశాడు విఠల్.

"వెరీ గుడ్ ! త్రాగటం తప్పే ! నీకు చెప్పకపోవడం ఏమిటి ? నేను బాటిల్సుకు బాటిల్సు త్రాగేస్తున్నాను ! ఎందుకు తాగుతున్నానో తెలియదు ! ఆమె గుర్తొచ్చినప్పుడల్లా మరీ త్రాగుతున్నాను ! సీసాలకు సీసాలు గుట్టలు పడిపోతున్నాయి !"

"ఆమంటే ఎవరు బాబాయ్ ? మీ మిస్సెసా ?" అని జంకుతూ అడిగాడు విఠల్.

ఆ త్రాగిన మైకంలో "నో నో" అనేశాడు. ఆ మరుక్షణమే తెలివిలోకి వచ్చి "యస్ ! యస్ !" అన్నాడు శివరాం ప్రసాద్ !

"ఇందాక...అలా అన్నారేం బాబాయ్ ! ఆమేదో మిమ్మల్ని బానిసగా చూసేదని...బాధ పెట్టేదనీ !"

"ఆ గొడవంతా ఇప్పుడెందుకులే ! ఇంకా ఏమయినా కబుర్లు చెప్పు... ఎన్నాళ్ళుంటా విక్కడ ?

"ఎన్నాళ్ళోనా ? రేపు వెళ్ళిపోతాను !"

"రేపే ! పదిరోజుల్దాకా నువ్వు వెళ్ళడానికి వీల్లేదు !" ఆర్డర్ వేసినట్లుగా మాట్లాడాడు శివరాంప్రసాద్.

"నేనిక్కడ పదిరోజులుంటే అక్కడ ఆమె..."

"బాబాయ్ రానివ్వడంలేదని రేపే మీ నాయనమ్మకు ఉత్తరం రాసెయ్ !

ఆమె ఏమీ అనదులే! పైగా ఇక్కడే వుండిపొమ్మని రాస్తుంది కూడాను! ఏమనుకుంటున్నావో?" పక పకా నవ్వాడు శివరాంప్రసాద్.

ఆ నవ్వు బలంతో లేచి గాడ్రేజ్ బీరువా దగ్గర కెళ్ళాడు. ఏవో డాక్యుమెంట్స్ తెచ్చి విఠల్ చేతి కిచ్చాడు.

"ఇవేంటి బాబాయ్!" అని ఆయన కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు విఠల్.

"ఇవి తీసికెళ్ళి మీ నాయనమ్మకివ్వు? ఆమె పేరరాసిన వీలునామా ఇది!"

ఆ మాట విని ఆశ్చర్యపోయాడు విఠల్. అతని కేమీ అర్థం కాలేదు

"మీ నాన్న పేరు కూడా రాయొచ్చనుకో! ఆయనో పెద్ద తాగుబోతు! జూదగాడు! పైగా ఆయనిప్పుడులేడు!" అంటూ ముగించాడు శివరాంప్రసాద్

"అయినా ఇదంతా ఏమిటి?" తిరిగి ప్రశ్నించాడు విఠల్

అదంతా నీకు తెలియదు! మీ నాయనమ్మ నా ఫస్ట్ వైఫ్! ఈ ఆస్తి కోసం కక్కుర్తిపడి ఆమె నొదిలేసి వచ్చేశాను! ఆస్తి దక్కింది కానీ ఆ ప్రేమ, ఆ మనశ్శాంతి ఎంత పెట్టి కొనుక్కుందామన్నా నాకు ఇక్కడ దొరకలేదు! ఆమెకు నేనంత అన్యాయం చేసినా ఆమె పల్లెత్తు మాటన్లేదు. ఏ దారిద్ర్యానికి భయపడిపోయి యిటు పరుగెత్తుకొచ్చానో, ఇవ్వాళ తిరిగి ఆ దారిద్ర్యాన్నే అనుభవించాలని అన్పిస్తోంది. మనసు తపిస్తోంది! నిజంగా ఆమెకు **నేను** చేసిన అన్యాయం క్షమించరానిది! అయినా ఆమె నన్ను క్షమిస్తుంది. అంత ఉత్తమురాలు," అంటూ భోరున ఏడ్చి సోఫామీద పడిపోయాడు.

బయట వర్షం కురుస్తోంది. ఉండుండి మెరుస్తోంది. అది ఇప్పుడు వెలిసేటట్టు లేదు! ఈయన ఇప్పుడు ఏడుపు మానేటట్టులేదు. విఠల్ అలాగే ఆయన్నంటి పెట్టుకొని కూర్చున్నాడు. అతని కళ్ళు ఉండుండి జడివాన కురిశాయి